

అమరావతికి చట్టబద్ధత లభించడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. రాష్ట్రపతి ఆమోదంతో శాశ్వత రాజధానిగా గెజిట్ నోటిఫికేషన్ రావడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దేశంలో చట్టబద్ధత పొందిన ప్రత్యేక రాజధానిగా అమరావతి చరిత్రలో నిలిచిపోతుంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

గురువారం 09.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 352 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం



**రోడ్ల కనెక్టివిటీతో ఎకనామిక్ యాక్టివిటీ**

**పోర్టు కారిడార్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు**

**గోదావరి పుష్కరాల్లోపే రహదారుల నిర్మాణం... మరమ్మత్తులు**

**ఈవీ బస్సుల వినియోగం పెంచి రవాణా వ్యయం తగ్గేలా చర్యలు**

**రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను కనెక్ట్ చేసేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం రహదారులు భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం, వివిధ రాష్ట్రాలను అనుసంధానించేలా జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రంలో రహదారుల నిర్వహణ పటిష్టంగా ఉండాలి. మొత్తంగా 45,433 కిలోమీటర్ల మేర రోడ్లు ఉంటే... వాటిల్లో ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేయాల్సి ఉంది. ప్రజలకు రోడ్ల వల్ల ఇబ్బంది లేకుండా చూడాలి. రోడ్ల నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియగా చేపట్టాలి. ఎక్కడైనా రోడ్లకు గుంతలు పడితే... వాటినే వెంటనే సరిదిద్దితే ఇక ఇబ్బందులు ఉండవు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పద్దతులను అవలంబిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలి. ఆర్ అండ్ బీ రహదారుల మెయింటెనెన్స్ కోసం నిధుల కొరత లేకుండా చూడాలి. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలి. రహదారి నిర్వహణకు ప్రామాణికతను నిర్దేశించాలి. స్థానికంగా భౌగోళిక పరిస్థితులు, వాతావరణం అంశాలను పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్వహణలో చర్యలు చేపట్టాలి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, బ్లాక్ కాటన్ సాయిల్ ఉన్న చోట మిగతా 2లో...

**2027 మార్చి నాటికి 1.12 కోట్ల**

## పట్టా దారు పాస్ పుస్తకాల పంపిణీ

**రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు**

**1.37 లక్షల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ నిర్ణయం**

**ఇతర సర్వీస్ ఇనాం లోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి**

**దీని కోసం కొత్తగా చట్టం తీసుకురావాలని సీఎం ఆదేశం**

**2016కు ముందు ప్రభుత్వ హౌసింగ్ స్కీంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్**

**75 లక్షల పేద కుటుంబాలకు వరాలు ప్రకటించిన ప్రజా ప్రభుత్వం**

2 లో

## వేగంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం



- **సిబ్బంది సమిష్టి కృషితో విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చింది**
- **రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ అందించే లక్ష్యంతో పనిచేస్తున్నాం**
- **విద్యుత్ బిల్లులు పెంచకుండా, అంతరాయం లేని సరఫరాపై దృష్టి**
- **విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించడమేకాకుండా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

గుణదల విద్యుత్ సౌధలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన కార్యాలయానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కేసినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మిగతా 2లో...

## పైరవీలతో పనిలేదు... పనితీరే ప్రామాణికం

- **ప్రస్తుతం నడుస్తున్నది తెలుగుదేశం 3.0 వర్షన్!**
- **ఏడాది పొడవునా నిరంతరం శిక్షణా తరగతులు నిర్వహిస్తాం**
- **జూన్ తర్వాత అందరూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లాల్సిందే!**
- **నిలకడలేని జగన్‌ను సీరియస్ గా తీసుకోవాల్సిన పనిలేదు**
- **టిడిపి శిక్షణా తరగతుల్లో కేడర్ తో మంత్రి లోకేష్ కాఫీకబుర్లు**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు సమూల మార్పులు తెస్తున్నాం, ప్రతి టర్మ్ లోనూ 33శాతం (3వ వంతు) కొత్తవారు ఉండాలన్నది తమ అభిమతం. గ్రామస్థాయి నాయకుడు పొలిట్ బ్యూరో వరకు చేరుకునే అవకాశం లభించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మన పంథా మారాలి. అలాగైతేనే పదికాలాల పాటు ప్రజాక్షేత్రంలో నిలబడగలమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం కేడర్ శిక్షణా తరగతుల్లో భాగంగా కాఫీకబుర్లు పేరుతో పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ చార్జిలతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మిగతా 2లో...

## కష్టపడే వారికి పట్టాభిషేకం

- **మీ పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణం**
- **పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుంది**
- **'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్ తో మంత్రి లోకేష్ ఆత్మీయ భేటీ**
- **పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం**

2 లో



## 'ఆయుష్మాన్' కార్డులపై ఆంక్షలు వద్దు!

- **రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన సీనియర్ సిటిజన్ కార్డులు మరియు "ఆయుష్మాన్ వయో వందన కార్డ్"లిలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తప్పనిసరిగా అంగీకరించేలా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయవలసిందిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న "జనతా వారధి " కార్యక్రమంలో భాగంగా "సర్వ స్పర్శి - సర్వ వ్యాప్తి" నినాదంతో పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుస్తున్న సందర్భంలో పెద్ద సంఖ్యలో వృద్ధులను కలిసినప్పుడు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించారని పేర్కొన్నారు 2లో...

## యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- **రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. మిగతా 2లో...

## సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్



- **రసాయనాల తగ్గింపు, ఆరోగ్యకరమైన భూమి, జీవన విధానం ముఖ్యం**
- **డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆలోచనాత్మకంగా ముందుకు సాగాలి**
- **సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **మారుటేరు కిసాన్ మేళాలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

3 లో

## అంతర్జాతీయ క్రియేటివ్ ఎకానమీ హబ్‌గా అమరావతి !



**ముంబయి/అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక మరియు సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా(క్రియేటివ్ ఎకానమీ హబ్) తీర్చిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముంబయిలోని గ్రాండ్ హయత్ హోటల్ లో 8-9 తేదీల్లో జరుగుతోన్న 21వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ సౌత్ ఏషియాకు మంత్రి దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటక రంగంలో తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పులను ఆయన వివరించారు. మంత్రి దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందం కంటెంట్, సంస్కృతి, జీవనశైలి మరియు ఇమ్మర్సివ్ డిజైన్‌ను పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో విలీనం చేయడంపై సృజనాత్మక మరియు అనుభవ ఆర్థిక వ్యవస్థకు చెందిన పలువురు వాటాదారులు అయిన జేఎస్ డబ్ల్యూ స్పోర్ట్స్, ఆర్ ఎంజెడ్, అర్వాస్, తమరా లీజర్ ఎక్స్‌పీరియన్సెస్, షాలెట్ హోటల్స్ మరియు హవాస్ మీడియా సంస్థల ప్రతినిధులతో కీలక చర్చలు జరిపింది. పర్యాటక రంగాన్ని ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, క్రియేటివ్ ఎకనామీ హబ్ గా మార్చడమే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ వారికి వివరించారు. మిగతా 3లో...



## ఇందిరా గాంధీ స్టేడియం అభివృద్ధికి రూ.170 కోట్లు

- **మూడు దశల్లో స్టేడియం అభివృద్ధి, క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం**
- **ఖేలో ఇండియా నిధులతో స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి నగరం, పట్టణం, గ్రామాల్లో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. 3 లో..

## రిక్రూట్మెంట్ బోర్డు ద్వారానే జోనళ్ల పోస్టుల భర్తీ

- **రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**
- **నియామకాలు మరింత త్వరగా, పాదరదర్శకశీగా జరిగేందుకు వీలుగా చర్యలు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జోనల్ స్థాయి ఉద్యోగ నియామకాల ప్రక్రియలో మరింత పారదర్శకత పెంచే విషయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలోని 4 జోనళ్ల కార్యాలయాలపై ఒత్తిడి తగ్గించే ఉద్దేశంతో కూడా జోనళ్ల స్థాయి పోస్టుల భర్తీకి సంబందించిన నోటిఫికేషన్ జారీ నుంచి ఎంపిక జాబితా ఖరారు వరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రక్రూటుమెంటు బోర్డు (ఏపీఎంఎస్ఆర్బీ ) ద్వారా జరుగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇకపై ఇచ్చే నోటిఫికేషన్ల జారీకి ఈ నిర్ణయం అమల్లోనికి వస్తుందని చెప్పారు. జీరో వెకెన్సీ కింద పోస్టుల భర్తీని ఎప్పటికప్పుడు చేబడుతున్నందున కొత్త నిర్ణయం ద్వారా త్వరితగతిన నియామకాలు పూర్తవుతాయని, పాదదర్శకత మరింత పెరుగుతుందని మంత్రి వేడిక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

**జోనళ్ల కార్యాలయాల ద్వారా... :** స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్స్, ఫార్మసీ అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, మెడికల్ రికార్డు టెక్నిషియన్ పోస్టుల భర్తీ జోనళ్ల వారీగా ప్రస్తుతం జరుగుతోంది. జోన్-1, జోన్-2, జోన్-3, జోన్ -4 కింద విశాఖ రాజమహేంద్రవరం, గుంటూరు, కడపలోని కార్యాలయాల కేంద్రంగా సదరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, మిగతా 3లో...

## కష్టపడే వారికి పట్టాభిషేకం



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** కష్టపడిన వారిని గుర్తించాలనేది పార్టీ సిద్ధాంతం అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న టాప్ 10 ఫెర్ఫార్మర్స్ తో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అనేది ఒక వ్యవస్థ. మనం అందరం ఆ వ్యవస్థలో భాగం. మీ పనితీరు వల్లే ఇక్కడ వరకు రాగలిగారు. రేపు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గారి పక్కన కూర్చొంటారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుంది. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమని గుర్తించాలి. పార్టీలో సంస్కరణల కోసం నేను పోరాడుతున్నా. కార్యకర్తే అధినేత. గ్రామ పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇంఛార్జ్ పొలిట్ బ్యూరో వరకు రాగలగాలి.

**ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి :** ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు. మనం కోరుకున్న మార్పు సాధ్యం కావాలంటే అందరం కలిసికట్టుగా పనిచేయాలి. పార్టీ భవిష్యత్ దృష్ట్యా కడప మహానాడులో తీర్మానించిన 6 శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ సిద్ధాంతాలను వివరించేందుకు 365 రోజులూ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. 2019-24 మధ్య జగన్ రెడ్డి ఎమ్మెల్యేలనే కలవలేదు. మనం కార్యకర్తలను కలుస్తున్నాం. నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నాం. వారానికోరోజు పార్టీ కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నాం. పార్టీ కోసం ప్రాణాలర్పించిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కోసం చట్ట సవరణ చేశాం. మీరందరూ క్షేత్రస్థాయిలో ఉండి పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం అందరినీ మంత్రి నారా లోకేష్ ఘనంగా సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపికను బహూకరించారు. పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేష్ తో ఆత్మీయ భేటీ పట్ల 'మై టీడీపీ యాప్' ఉత్తమ కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. తాము జీవితాంతం మర్చిపోలేమని ఆనందం వ్యక్తం చేశారు.

## 'ఆయుష్మాన్' కార్డులపై ఆంక్షలు వద్దు!



(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా, సీనియర్ సిటిజన్ కార్డులు మరియు ఆయుష్మాన్ వయో వందన కార్డులను అనేక ఆసుపత్రులలో అంగీకరించకపోవడం వల్ల వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు తగిన ఆదేశాలు జారీ చేసి, అన్ని సంస్థలు ఈ కార్డులను గౌరవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాధవ్ కోరారు.

వృద్ధుల గౌరవం, భద్రత, మరియు సౌకర్యాల పరిరక్షణ ప్రతి సమాజం యొక్క బాధ్యత అని, అందువల్ల ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ (ఆయుర్వేద, యోగా మరియు నేచరోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి) వైద్య వ్యవస్థ అభివృద్ధి అవసరాన్ని మాధవ్ ప్రస్తావించారు

ప్రాచీన భారతీయ వైద్య విధానాలకు దేశీయంగానే కాక అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పెరుగుతున్న ఈ సమయంలో, రాష్ట్రంలో ఆయుష్ రంగాన్ని మరింత బలోపేతం చేయడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సహజసిద్ధమైన, అందుబాటులో ఉన్న వైద్యం అందించడం ఆరోగ్య పరిరక్షణలో కీలకమని అన్నారు .

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల్లోని బీజేపీ మంత్రుల సమన్వయంతో ఆయుష్ ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు, విద్యాసంస్థలను అభివృద్ధి చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ సేవలను విస్తరించడం ద్వారా తక్కువ ఖర్చుతో సమగ్ర వైద్యం అందించవచ్చని తెలిపారు. అలాగే, ఆయుష్ వైద్యులకు తగిన ప్రోత్సాహకాలు, మౌలిక వసతులు, పరిశోధన అవకాశాలు కల్పించడం ద్వారా ఆరోగ్య రంగంలో నాణ్యతను పెంపొందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. యోగా, నేచరోపతి వంటి పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

ఆయుష్ రంగ అభివృద్ధి ద్వారా ప్రజల ఆరోగ్య స్థాయి మెరుగుపడటంతో పాటు, భారతీయ సంప్రదాయ వైద్య విధానాలకు మరింత గౌరవం లభిస్తుందని మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమరావతిలో కేంద్ర ప్రభుత్వ నిర్మాణాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రూ.2,534 కోట్లతో అమరావతిలో కేంద్ర ప్రభుత్వం నిర్మాణాలను చేపట్టనుంది. అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్ సిద్ధం చేసిన సిపిడబ్ల్యూడి, కేంద్ర మంత్రివర్గం ఆమోదానికి పంపింది. అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం రూ.1,299.08 కోట్లు, నివాస సముదాయాల ఏర్పాటు కోసం రూ.1,234.91 కోట్లతో కూడిన పిఐబి మెమోరాండం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగాలంటే కేబినెట్ సెక్రటేరియట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌కు క్లియరెన్స్ రావాల్సి ఉంది. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ వెలువడిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఎపి అధికారులు ఇప్పటికే కేబినెట్ సెక్రటేరియట్‌కు సమర్పించారు. వచ్చే కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అనుమతి లభించే అవకాశం ఉంది. ప్రాజెక్టు తదుపరి అనుమతులకు కీలకమైన కేబినెట్ సెక్రటేరియట్ క్లియరెన్స్ మాత్రమే పెండింగ్ ఉంది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఫైల్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపారు. అమరావతిలో కేంద్ర నిర్మాణాల కోసం మొత్తం 22.53 ఎకరాల భూమిని సిఆర్‌డిఎ కేటాయించింది. సిపిడబ్ల్యూడి కోసం 22.53 ఎకరాల భూమిని ఏపి ప్రభుత్వం ఇచ్చింది. ఇందులో 5.53 ఎకరాలు సెక్రటేరియట్ నిర్మాణానికి, 17 ఎకరాలు నివాస సముదాయాల(జిపిఆర్ఎ) ఏర్పాటుకు కేటాయించారు. కేబినెట్ సెక్రటేరియట్ నుంచి క్లియరెన్స్ వచ్చిన వెంటనే అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు జరిగే అవకాశం ఉంది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. అమరావతి కేంద్రంగా పని చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం మల్టీస్టోరేజ్ నివాస సముదాయాలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు.

# జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

హైబ్రీడ్ మోడల్ లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుంది. కాలువలు ఉన్న 570 కిలోమీటర్ల మేర రహదారులు పదే పదే ధ్వంసం అవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఏ మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణం జరిగితే బాగుంటుందనేది ఆలోచన చేయాలి. దీనిపై యూనివర్శిటీల్లో అధ్యయనం చేయిస్తే కొత్త ఆవిష్కరణలు వస్తాయి. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టండి. గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తంగా 471 గ్రామాల్లో రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలి. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రోడ్ల అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా పనులు చేపట్టాలి. పుష్కరాలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.400 కోట్లతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలి. దీని కోసం సాస్కీ నిధులను వినియోగించుకోవాలి. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని' అని సీఎం సూచించారు.



**పోర్టుల అనుసంధానానికి ప్రాధాన్యత :** "రాష్ట్రంలోని పోర్టులను కనెక్ట్ చేసేలా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఆర్థిక లావాదేవీలకు కేంద్రంగా పోర్టులు ఉన్నాయి. పోర్టులను కనెక్ట్ చేసేలా పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ అలానే ఉంది. తూర్పు భారతంలో తీర ప్రాంతం, పోర్టుల విషయంలో ఏపీ కీలకంగా ఉంది. ఈస్ట్-వెస్ట్ కారిడార్ గా జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఈ రకమైన కనెక్టివిటీని పెంచడం ద్వారా లాజిస్టిక్స్ వ్యయం గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి. లాజిస్టిక్స్ రంగాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చేసేలా పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలి. దీని నిమిత్తం ఏపీ లింక్ ద్వారా ఆర్థిక వనరుల్ని సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. మౌలిక సదుపాయాల ద్వారా సామాన్యుడికి సౌకర్యాలు పెరగాలి, ఇదే సమయంలో ఆర్థిక లావాదేవీలు జరగాలి. ప్రభుత్వం ప్రజాధనాన్ని అభివృద్ధి కోసం ఖర్చు చేస్తోంది. ప్రతి పైసా సద్వినియోగం కావాలి. అత్యుత్తమ ఫలితాలు రావాలి. ప్రస్తుతం 73 శాతం కార్గో రోడ్ రవాణ ద్వారానే వెళ్తోంది. రైల్వే ద్వారా వెళ్లే కార్గో వ్యయం తక్కువగా ఉన్నట్టే రహదారుల కార్గో వ్యయం కూడా తగ్గాల్సిన అవసరం ఉంది. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టుల మధ్యనున్న ప్రాంతాలను అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఆయా పోర్టులను అనుసంధానం చేసే సమయంలో ఆయా పోర్టులకు సమీపంలోని పొరుగు రాష్ట్రాల సరిహద్దులను కలుపుకుని వెళ్లేలా ప్రధాన రహదారులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఉండాలి. రహదారుల నిర్మాణం వల్ల ఎకనామిక్ యాక్టివిటీ పెరగాలి. జాతీయ రహదారులకు సమీపంలో ఉండే ప్రాంతాల అభివృద్ధి జరగాలి. జాతీయ రహదారులతో పాటు దేశ నిర్మాణం జరగాలి. ఏపీ పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా మారుతోంది. జాతీయ అంతర్జాతీయ మార్కెట్లకు కనెక్టు చేసేలా రహదారులు రావాలి. వివిధ నగరాలకు రింగ్ రోడ్లు వస్తే ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయి. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీని కనెక్టు చేసేలా రహదారుల నిర్మాణం జరగాలి. ఖరగ్ పూర్- అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం దోర్నాల హైవే, కల్వకుర్తి-నంద్యాల హైవే వంటి జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. వివిధ కారిడార్ల ద్వారా 1335 కిలోమీటర్ల జాతీయ రహదారుల రెండేళ్లలో అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాదిలో రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలి. రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు ప్రాంతాల్లో అవుటర్ కారిడార్ మోడల్స్ ను అధ్యయనం చేయాలి." అని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

**ఈవీలతో తక్కువ రవాణా వ్యయం :** "అతి తక్కువ వ్యయంతో ప్రజా రవాణా అందుబాటులోకి రావాలి. దీనికి ఈవీ బస్సుల వినియోగం సరైన మార్గం. క్లీన్ ఫ్యూయెల్ వినియోగం ఎక్కువ జరిగితే ఖర్చు తగ్గుతుంది. ఫలితాలు ప్రజలకు అందుతాయి. సోలార్ పవర్ ను సమర్థంగా నిర్వహించడం ద్వారా విద్యుత్ కొనుగోలు ధరను సుమారు రూ.1 మేర తగ్గించ గలిగాం. కాస్ట్ ఆప్టిమైజేషన్ ఆఫ్ ఫ్యూయల్ విధానంపై దృష్టి సారిస్తే తక్కువ ఖర్చు.. ఎక్కువ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈవీ బస్సులకు కిలోమీటరుకు రూ.72 వ్యయం అవుతోంది. వివిధ మోడళ్లను అధ్యయనం చేసి అతి తక్కువ వ్యయంతో ఈవీలను ఆపరేట్ చేయాలి. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ లాంటి అంశాలను పరిశీలించాలి. అన్నీ కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులే ఉండాలి. ఈ సైకిళ్ల వినియోగం మరింతగా పెంచేలా ప్రమోట్ చేయాలి. ఈ-సైకిళ్లు మాస్ ట్రాన్ పోర్టుగా మారేంతగా ప్రజలకు అవగాహన కల్పించాలని" సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పైరవీలతో పనిలేదు... పనితీరే ప్రామాణికం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్ తో సరికొత్త పంథాలో దూసుకుపోతోంది. పార్టీ కేడర్ కు సభ్యత్వ నంబర్ ఆధార్ కార్డు లాంటిది. ఆ నంబర్ ఎంటర్ చేస్తే ఎవరు ఎంతపనిచేశారో తెలిసిపోతుంది. ఎలాంటి పైరవీలతో పనిలేకుండా పనిచేసే కార్యకర్తలను గుర్తించి పదవులిస్తాం. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తామంతా కింద కూర్చోగా, బాబు గారి పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారు, పార్టీలో వస్తున్న అనూహ్య మార్పులకు ఇదొక సంకేతం.



**తెలుగుదేశం రాజకీయ విశ్వవిద్యాలయం :** పార్టీని అట్టడుగుస్థాయి నుంచి బలోపేతం చేయడం, పనిచేసే కార్యకర్తలను ప్రోత్సహించి గుర్తించడమే శిక్షణా తరగతుల ప్రధాన లక్ష్యం. ఇకపై క్లస్టర్, యూనిట్, గ్రామ, మండలస్థాయి వరకు ఏడాది పొడవునా నిరంతరం శిక్షణా తరగతులు నిర్వహిస్తాం. తెలుగుదేశం పార్టీ రాజకీయ విశ్వవిద్యాలయం లాంటిది. తెలంగాణాలో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రితోపాటు అక్కడి మెజారిటీ నాయకులు టిడిపి నుంచి వచ్చినవారే. 1989-94 నడుమ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న చంద్రబాబునాయుడు ట్రైనింగ్ క్లాసులు పెట్టి కేడర్ ను చైతన్యవంతం చేశారు. అయితే పార్టీ ఆవిర్భావం తర్వాత అట్టడుగు స్థాయి నుంచి కేడర్ కు పెద్దఎత్తున శిక్షణా తరగతులు నిర్వహించడం ఇదే ప్రథమం.

**నాయకులు కాదు... పార్టీనే శాశ్వతం! :** తెలుగుదేశం కేడర్ బేస్డ్ పార్టీ. పార్టీలో నేనే రాజు, నేనే మంత్రిని అనే అభిప్రాయాన్ని నాయకులు సరిచేసుకోవాలి. టిడిపిలో లోకేష్ లేదా మరో నాయకుడు శాశ్వతం కాదు. పార్టీ శాశ్వతం. సమర్థవంతమైన నాయకుడు తమ తర్వాత నాయకత్వాన్ని తయారుచేస్తాడు. గతంలో వ్యక్తులను నమ్మి పార్టీ నష్టపోయింది, ఇప్పుడు వ్యక్తులపై కాకుండా వ్యవస్థపైనే ఆధారపడ్డాం. 2014-19 నడుమ పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసి కూడా ఓటమి పాలయ్యాం. పార్టీ దీర్ఘకాలంగా అధికారంలో ఉండటానికి బిజెపిని మనం ఆదర్శంగా తీసుకోవాలి. పార్టీ సిద్ధాంతాలను కమిట్ మెంట్ తో అమలుచేసే క్రమశిక్షణగల కేడర్ ఉండటమే వారి విజయరహస్యం. మన మై టిడిపి యాప్ మాదిరిగానే వారికి సరళ్ యాప్ ఉంది. గ్రామస్థాయి కార్యకర్త నుంచి కేంద్రమంత్రి వరకు ఎవరికి అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడమే వారి విజయ రహస్యం.

**మహానాడును విజయవంతం చేద్దాం :** 1985 తర్వాత ఎన్నడూ గెలవని మంగళగిరిని ఎంచుకొని నేను తొలి ప్రయత్నంలో ఓడిపోయాను. ఐదేళ్లపాటు పట్టుదలతో పనిచేసి గతఎన్నికల్లో 91వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందాను. భారీ మెజారిటీతో గెలిచినప్పటికీ... నియోజకవర్గ పరిధిలోని 20బూత్ ల పరిధిలో మైనస్ వచ్చింది. దానిని కూడా అధిగమించేందుకు హోంవర్క్ చేస్తున్నా. కాన్ఫిడెన్స్ ఉంటేనే ఏదైనా సాధించగలం. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించి పరిష్కరించుకోవాలి. అలిగి ఇంట్లో పడుకోవడం అంటే పార్టీకి అన్యాయం చేయడమే. పార్టీలో సంస్కరణల కోసం నేను చంద్రబాబు గారితో ఒక యుద్ధమే చేశాను. మన పార్టీ పెద్దపండుగ మహానాడు ప్రిపరేషన్ వర్క్ ప్రారంభమైంది. విజయవంతం కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలి.

**చంద్రబాబు నీడే మనకు శ్రీరామరక్ష :** అరాచక పాలనలో ఐదేళ్లు ఇబ్బందులు పడ్డాం. దేవాలయాలపై దాడులు చేశారు, పార్టీ కార్యకర్తలను విచక్షణారహితంగా పొట్టనబెట్టుకున్నారు. దాదాపు 35వేల తప్పుడు కేసులు బనాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ అధ్యయనం చేసి, 60శాతం అక్రమకేసులను తొలగించాం. మంచిరోజులు వచ్చాయి కదా అని కష్టకాలంలో పడిన ఇబ్బందులను మరువద్దు. అధికారం ఉందని అహంకారం వద్దు. ఓర్పు, సహనంతో ముందుకు సాగుదాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం అహర్నిశలు కష్టపడదాం. చంద్రబాబు అనే మహావృక్షం నీడే మనకు శ్రీరామరక్ష. ఒంటెద్దు పోకడలతో వెళ్లే నాయకులకు పద్ధతి మార్చుకోవాల్సిందిగా మూడుసార్లు చెప్పి చూస్తాం, వినకపోతే 4వసారి దండం పెట్టి కొత్తవారికి బాధ్యతలు అప్పగిస్తాం. పార్టీలో ఎవరి పోస్టులు శాశ్వతం కాదన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకొని మసలుకోవాల్సిందిగా విజ్ఞప్తిచేస్తున్నా.

**జగన్ ను సీరియస్ గా తీసుకోవాల్సిన పనిలేదు :** వైసిపి అధినేత జగన్ మాటలను ఎవరూ సీరియస్ గా తీసుకోవాల్సిన పనిలేదు. నిన్న మావిగన్ అన్న నోటితోనే మళ్లీ ఈరోజు మూడు రాజధానులు అంటున్నాడు. అధికారంలో ఉన్నప్పుడే కాకుండా ఇప్పుడు కూడా ఆయన ప్రజలకు దగ్గరగా ఉండటం లేదు. ఇంటివద్ద 30అడుగుల ఇనుప కంచె ఏర్పాటుచేసుకున్నాడు. 2019లో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలయ్యాక చంద్రబాబునాయుడు అనునిత్యం జనంలోనే ఉన్నారు, వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఏడాదిలోనే ఇసుక కష్టాలపై ఉద్యమించారు. కార్యకర్తల ఆవేదనను విన్నారు. వాటన్నింటినీ గుర్తుపెట్టుకొని కేడర్ కు దగ్గరగా ఉంటూ ఆయన ముందుకు సాగుతున్నారు. కేడర్ ను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. పార్టీలో పనిచేయడానికి పదవులే ప్రామాణికం కాదు, వివిధ సమీకరణాల వల్ల ఇప్పుడు అవకాశం రానివారికి మరోసారి కల్పిస్తాం.

**హనీమూన్ ముగిసింది... జనంలోకి వెళదాం! :** ప్రస్తుతం మనకు హనీమూన్ పీరియడ్ ముగిసింది. ప్రతిఒక్కరూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పనిచేయాలి. జూన్ నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యక్రమాన్ని రూపొందిస్తాం. కార్యక్రమాలను సమర్థవంతంగా జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్ దే. ప్రతి బూత్ కూడా మనకు చాలా కీలకం. 94శాతం స్ట్రైక్ రేటుతో గెలిచినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా 4,600 బూత్ లలో మనం వెనకబడ్డాం. వాటిపై నాయకులు దృష్టిసారించాలి. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడదాం. గత మహానాడులో ఇచ్చిన ఆరు శాసనాలను అమలుచేద్దాం. కార్యకర్తే అధినేత అనే శాసనం ఇప్పటికే కార్యరూపం దాల్చింది. కూటమి మళ్లీ అధికారంలోకి వస్తేనే మనం అభివృద్ధిని కొనసాగించగలం. చంద్రబాబు నాయుడు బలంగా ఉంటేనే అంతా సంతోషంగా ఉంటారన్న సందేశాన్ని జనంలోకి తీసుకెళ్లాలని యువనేత లోకేష్ పిలుపునిచ్చారు.

## 2027 మార్చి నాటికి 1.12 కోట్ల పట్టా దారు పాస్ పుస్తకాల పంపిణీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2027 మార్చి నాటికి రీ సర్వే 2.0 పూర్తి చేసి 1.12 కోట్ల కొత్త పట్టా దారు పాసు పుస్తకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా భూ వివాదాలు సృష్టించింది. వీటిని పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టిన ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రీ సర్వే 2.0లో భాగంగా ఇప్పటికి 6,976 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా... వీటితో 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరుగుతోంది. సర్వే పూర్తయిన మిగిలిన 1,259 గ్రామాలకు సంబంధించి 9 లక్షల పాసు పుస్తకాలను ఈ ఏడాది జూలై నాటికి పంపిణీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే వచ్చే ఏడాది మార్చి నాటికి రీ సర్వేతో పాటు...పాసు పుస్తకాల పంపిణీ 100 శాతం పూర్తి కావాలని ఆదేశించారు. దీని కోసం నెలవారీ లక్ష్యాలను సిద్ధం చేసుకుని కార్యాచరణ అమలు చేయాలన్నారు. జూలై తరువాత మార్చి లోపు 80 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరగాలని తేల్చి చెప్పారు. తప్పులకు ఆస్కారం లేకుండా పాసు పుస్తకాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు.



**1.37 లక్షల ఎకరాల భూములకు విముక్తి :** సచివాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో లక్షల కుటుంబాలకు లబ్ది చేకూర్చేలా ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇతర సర్వీస్ ఇనాం లోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి కల్పించనున్నారు. దీని కోసం కొత్తగా చట్టం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. 2019లో సర్వీస్ ఇనాం భూములకు సంబంధించి నాడు ఆర్డినెన్స్ జారీ చేసినప్పటికీ... తరువాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆర్డినెన్స్ మరుగున పడింది. దురుద్దేశంతో గత ప్రభుత్వం దీనిని చట్టంగా మార్చకుండా లక్షల కుటుంబాలకు నష్టం చేకూర్చింది. అయితే ప్రజా ప్రభుత్వం వీరికి న్యాయం చేసేందుకు, సాయంగా నిలిచేందుకు దీనిపై చట్టం చేయాలని నిర్ణయించింది.

**ఇంటి పట్టా ఉంటే... రిజిస్ట్రేషన్ :** 2016కు మందు ఏదైనా ప్రభుత్వ హౌసింగ్ స్కీంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం దాదాపు 75 లక్షల పేద కుటుంబాలకు వరంగా మారనుంది. 2016 ముందు పట్టా కలిగిన యజమాని... నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, విక్రయించేందుకు, గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నిర్ణయం లక్షలాది పేదల కుటుంబాలకు ఆస్తిగా మారుతుంది. అలాగే రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ కింద 13.59 లక్షల ఎకరాల భూమి ఉండగా...ఇందులో అర్హత కలిగిన 9.25 లక్షల ఎకరాలపై భూ యజమానులకు త్వరలో పూర్తిగా యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. రాష్ట్రంలోని ప్రతీ రెవెన్యూ రికార్డును డిజిటలైజ్ చేయాలని, భూ యజమానికి మొబైల్‌కి సాఫ్ట్ కాపీ పంపించాలని సీఎం అన్నారు. ఈ కేవైసీ అనంతరం రికార్డులను బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రపర్చాలని సీఎం చంద్రబాబు సూచించారు. భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి రికార్డ్ లాకింగ్ చేసుకోవచ్చు. దీని కారణంగా ఆయన నాలెడ్జ్ లో లేకుండా రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు. ప్రజల భూములకు రికార్డ్ లాకింగ్ రక్షణ కవచంగా ఉంటుంది. సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మితో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు.

## 15 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు ఈ నెల 15 నుంచి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు స్వర్ణ గ్రామ, వార్డుల (ఎస్‌జిఎస్‌డబ్ల్యు) శాఖ తెలిపింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల విద్యాశాఖ, సంబంధిత అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తొలి విడతలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ, మలి విడతలో ఈ నెల 21 నుంచి 24 వరకు ఈ శిబిరాలను స్వర్ణ గ్రామ, వార్డుల కార్యాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మార్చి 2026 వరకు ఆధార్ నమోదు కార్యక్రమాలు పూర్తయ్యాక, రాష్ట్రంలో సుమారు 12.09 లక్షల మంది బయోమెట్రిక్ నమోదు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన శిబిరాల ద్వారా 79 వేల బయోమెట్రిక్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. ముఖ్యంగా 15 నుంచి 17 ఏళ్ల వయసు గల జూనియర్ కాలేజీ విద్యార్థుల బయోమెట్రిక్ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. కొత్త ఆధార్ నమోదు, ఇతర సేవలు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. జిల్లాల వారీ పరిశీలిస్తే, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కువ బయోమెట్రిక్ నమోదులు పెండింగ్‌లో ఉన్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,09,554 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన ఆధార్ కిట్ల మొబిలైజేషన్ కోసం ప్రతి కేంద్రానికి రూ.1,000 చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. అదనపు భద్రత, సహాయక చర్యల కోసం మహిళా పోలీసులను కూడా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాలు నిర్వహించే సమయంలో డిజిటల్ అసిస్టెంట్లు, డబ్ల్యుఇడిపిఎస్‌లను ఇతర పనులకు పంపొద్దని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఇందిరా గాంధీ స్టేడియం అభివృద్ధికి రూ.170 కోట్లు



(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం అభివృద్ధి పనులకు ఖేలో ఇండియా నిధులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభ సందర్భంలో ఈ కార్యక్రమం జరగడం విశేషమన్నారు. విజయవాడ నగరానికి ఎంతో భావోద్వేగ అనుబంధం కలిగిన ఐజీఎమ్ఎస్ స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్టేడియం అభివృద్ధికి మొత్తం సుమారు రూ. 160 నుండి రూ. 170 కోట్ల వరకు మూడు దశల్లో వ్యయం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా రూ. 20 కోట్లు, మిగిలిన నిధులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరనున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ ఐదేళ్లలో ఆగిపోయిన క్రీడా అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు వేగం పుంజుకున్నాయని, గుంటూరులో ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని, త్వరలో శ్రీకాకుళంలో కూడా పనులు ప్రారంభమవుతాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రూ.1000 కోట్ల నిధుల ప్రతిపాదనలు ఉన్నాయని, రెండో విడతలో రూ.100 కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి కొనియాడారు. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఆపీఎల్) మ్యాచ్‌లను అమరావతిలో ప్రారంభించి కడపలో ముగించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, అమరావతి రాజధానిగా శాశ్వత గుర్తింపు రావడంతో నగరానికి మరింత అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పార్లమెంటు సభ్యులు చెప్పారు.

శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ... స్టేడియం అభివృద్ధిలో ఎంపీ కేశినేని శివనాథ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్టేడియం అభివృద్ధి కోసం పలుమార్లు సందర్శించి మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఎంపీ సూచనల మేరకు స్టేడియంలో ఒక బ్లాక్‌కు ప్రముఖ మహిళా క్రీడాకారిణి పేరు పెట్టనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం పూర్తిగా రూపురేఖలు మారిపోతాయని, అంతర్జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలను నిర్వహించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, జిల్లా కలెక్టర్ డా. జీ. లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం. ధ్యానచంద్ర,, శాప్ వీసీ అండ్ ఎండీ ఎస్. భరణి, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, మార్కోలైన్స్ పేవ్‌మెంట్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ డైరెక్టర్ వెల్లంకి రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రియేటివ్ ఎకానమీ హబ్‌గా అమరావతి !

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అమరావతిని కేవలం ఒక నగరంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయి 'క్రియేటివ్ ఎకానమీ హబ్'గా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామన్నారు. కేవలం సందర్శనకే పరిమితం కాకుండా సందర్శకులకు సరికొత్త అనుభూతిని పంచే 'ఎక్స్ పీరియన్స్ ఎకానమీ' వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈరోస్ ఇంటర్నేషనల్, రెడ్ బుల్ వంటి దిగ్గజ సంస్థలతో కలసి పని చేయడం ద్వారా రాష్ట్రంలోని అమరావతి, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలను కలుపుతూ ఒక భారీ 'స్టోరీటెల్లింగ్ కారిడార్'ను అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు.ఏపీ ఆధ్యాత్మికతను, సంస్కృతిని డిజిటల్ మాధ్యమాల్లో అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేయడానికి, భవిష్యత్ తరాలకు అందించేందుకు హోలోగ్రాఫిక్ స్టోరీటెల్లింగ్ మరియు ఇమ్మర్సివ్ కల్చరల్ నెరేటివ్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. రెడ్ బుల్ భాగస్వామ్యంతో క్రీడాకారుల జీవనశైలి,గమ్యస్థానాల ఆధారిత కథనాలను రూపొందించి ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ వేదికపై నిలబెడతామని మంత్రి దుర్గేష్ అన్నారు. లిఈ సందర్భంగా ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థతో కీలక చర్చలు జరిపిన మంత్రి దుర్గేష్ నెలరోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి విశేష ప్రాధాన్యతనిస్తుందని, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పనతో పాటు నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు ప్రోత్సాహకాలు కల్పిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ఇప్పుడు సంప్రదాయ పద్ధతుల నుండి బయటపడి గ్లోబల్ కంటెంట్ ప్లాట్‌ఫారమ్‌గా ఎదగడానికి సిద్ధంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు, సాంస్కృతిక కథనాలకు మరియు ఇమ్మర్సివ్ టూరిజం అనుభవాలకు ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. తద్వారా యువతకు ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధితో పాటు అంతర్జాతీయ గుర్తింపును సాధించడమే తమ లక్ష్యమని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ క్రియేటివ్ ఎకానమీ విభాగపు లీడ్ సత్య ప్రభ, సీనియర్ కన్సల్టెంట్ సాహితీ దివి పాల్గొన్నారు.

# యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాగార్జున యూనివర్శిటీలోని డాక్టర్ హెచ్.హెచ్.డైక్ మన్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవకాశాలపై ఒకరోజు అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి, అనంతరం మంత్రి సవిత ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఏర్పాటుపై అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు మేలు కలుగజేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంతకుముందు ప్రకృతి వ్యవసాయంతో ఎలా లాభాలు ఆర్జించ వచ్చో అవగాహన సదస్సు నిర్వహించారన్నారు. ఇప్పుడు ఉపాధి కల్పనపై మరో అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయుల పేదరికాన్ని పారదోలడానికి కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.

**ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు పెద్దపీట :** దేశ పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 22 నెలల కాలంలోనే ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే పెట్టుబడి దారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. తక్షణ అనుమతులకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అండగా నిలుస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువత డీపీఆర్ లతో ముందుకొస్తే, చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తామని మంత్రి సవిత తెలిపారు.

**యువతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యం... :** ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఒక రోజు సదస్సును ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువత, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతే భారత దేశ బలమని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అందుకే సీఎం చంద్రబాబు అన్నింటా యువతకు ప్రాధాన్యమిస్తున్నారు.



కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ల కంటే పారిశ్రామికవేత్తలుగా తోటి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. పారిశ్రామిక వేత్తలు గా మహిళలు రాణిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ఈడబ్ల్యూఎస్ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ, అగ్ర కులాల్లో పేదరికంతో బాధపడే వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతకుముందు ఆడిటోరియంలో వివిధ సంస్థలకు చెందిన తొమ్మిది స్టాళ్లను మంత్రి సవిత పరిశీలించారు. పరిశ్రమల ఏర్పాటుకు వారు అందిస్తున్న తోడ్పాటును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సీఈవో ఎం.విశ్వ, వీసీ గంగాధర్ రావు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డైరెక్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె. విజయానంద్, సీఎండీ పి. పుల్లా రెడ్డి ల సమక్షంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. ఏపీసీపీడీసీఎల్ (ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) నూతన కార్యాలయం ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. సిబ్బంది సమిష్టి కృషితో విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చిందన్నారు. సుమారు 35 నుండి 40 కోట్ల రూపాయల వ్యయంతో, 65 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, ఆదేశాలు అనుగుణంగా పనిచేస్తూ.. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, నాణ్యమైన విద్యుత్తును నిరంతరం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పవర్ డిస్టర్బెన్స్ (విద్యుత్ అంతరాయం) ఉండకూడదని, లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని అందుకు అనుగుణంగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వినియోగదారులలో విద్యుత్ శాఖ పట్ల ఉన్న సానుకూల దృక్పథాన్ని ప్రస్తుతం ఉన్న 80% నుండి 95% పైకి తీసుకెళ్లడమే మా లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

రైతులకు పగటిపూట విద్యుత్ పీఎం కుసుమ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ అందించడం కోసం చేపట్టిన టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే ఈ



పనులు ప్రారంభమవుతాయన్నారు. రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి, ఆధునిక పద్ధతులు ఉపయోగించి, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని సాధించామన్నారు. పగటిపూట విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేస్తూ, సాయంత్రం పీక్ అవర్స్‌లో మనమే స్వయంగా జనరేట్ చేసుకుంటూ విద్యుత్ లోటు లేకుండా చూస్తున్నామన్నారు. సోలార్, విండ్ (గాలి మళ్ళీ), మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ కోసం ఇప్పటికే 10 చోట్ల టెండర్లు పిలవడం జరిగిందన్నారు. విపత్తు సమయాల్లో విద్యుత్ సిబ్బంది తమ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నారన్నారు.

గతంలో వరదలు వచ్చినప్పుడు ముఖ్యంగా విశాఖపట్నంలో తుపాను వచ్చినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి పనిచేశారన్నారు. దాదాపు 1500 నుండి 2000 మంది సిబ్బంది తమ కుటుంబాలను వదిలి, కేవలం 24 గంటల్లోనే సుమారు 20 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని కోరారు. పగలు, రాత్రి తేడా లేకుండా పనిచేసే శాఖగా విద్యుత్ శాఖను మంత్రి రవికుమార్ పేర్కొన్నారు..

ఎనర్జీ సెక్రటరీ విజయానంద్ మాట్లాడుతూ... విద్యుత్ కొనుగోలు, అమ్మకాల్లో పారదర్శకత కోసం మానవ ప్రమేయం లేని అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నామన్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 14,009 మెగావాట్ల విద్యుత్ గరిష్ట లోడ్ ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ వేసవిలో విద్యుత్ కు ఎటువంటి అంతరాయం లేకుండా 275 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. ఏపీ జెన్కో ప్లాంట్ల సామర్థ్యాన్ని 85-90% కి పెంచామన్నారు. ఏపీసీపీడీసీఎల్ భవనాన్ని 'నెట్ జీరో' కాన్సెప్ట్ తోపాటు సోలార్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించడమే కాకుండా కార్బన్ న్యూట్రాలిటీని సాధించాలనే లక్ష్యంగా పెట్టుకుని నిర్మించామన్నారు.సీఎండి పుల్లారెడ్డి గారు మాట్లాడుతూ.. డిస్కం అధికారులు అందరూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు.

కార్యక్రమం లో టెక్నికల్ డైరెక్టరు మురళీ కృష్ణ యాదవ్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టీ వీ ఎస్ ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సి.జి.ఎమ్ లు, జిఎమ్ లు పాల్గొన్నారు.

# రిక్రూట్మెంట్ బోర్డు ద్వారానే జోనల్ల పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాల స్వీకరణ ఎంపిక జాబితా ఖరారు, కౌన్సెలింగ్ పోస్టింగు ఉత్తర్వుల జారీ ప్రాంతీయ కార్యాలయాల ద్వారానే జరుగుతోంది. ఈ క్రమంలో పోస్టుల భర్తీ తీరుపై పలు సందర్భాల్లో విమర్శలు వస్తున్నాయి. ఈ మధ్యన రాజమహేంద్రవరం జోనల్ కార్యాలయం ద్వారా 310 వరకు నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా 12,000 వరకు దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల్లో పేర్కొన్న అర్హతలు, సీనియార్టీ, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించేందుకు 3 నెలల వరకు సమయం పట్టింది.. ఇలా పోస్టుల సంఖ్య అనుసరించి వచ్చే దరఖాస్తుల ప్రకారం ఎంపిక జాబితా ప్రకటించేందుకు ఎక్కువ సమయం పడుతోంది. ఈ జోనల్ల కార్యాలయంలో రికార్డు అసిస్టెంటు నుంచి సూపర్నెంటెండెంట్ల వరకు కలిపి సగటున 15 మంది వరకు ఉంటున్నారు.

మరోవైపు. దరఖాస్తుల పరిశీలన కోసం తాత్కాలిక పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీనియర్ అసిస్టెంట్స్,ఇతర ఉద్యోగుల సేవలను పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో రిక్రూటుమెంటు బోర్డు ద్వారానే జోనల్ల పోస్టుల భర్తీకి సంబంధించిన జాబితా ఖరారు వరకు చర్యలు తీసుకోవడం ద్వారా అక్కడి అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తగ్గుతోంది. ఉద్యోగుల పదోన్నతులు, ఉద్యోగుల సర్వీసు వ్యవహారాల పరిశీలనకు తగిన సమయం దొరుకుతుంది.

**రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా... :** రిక్రూట్మెంటు బోర్డులో దరఖాస్తుల పరిశీలన దగ్గర నుంచి ఎంపికచేసిన వారి జాబితా ఖరారు వరకు తీసుకోవాల్సిన చర్యలపై బోర్డులో స్పష్టమైన విధానం అమల్లో ఉంది. ఈ బోర్డు ద్వారా రాష్ట్ర సాయి నియామకాలు (మెడికల్ ఆఫీసర్లు, అసిస్టెంటు ప్రొఫెసరు, సైక్రియాటిస్టులు, ఇతర పోస్టులు) జరుగుతున్నాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆయుష్ హెచ్ ఓ డీ కార్యాలయాల నుంచి ఇండెంట్ల ఆధారంగా రిక్రూటుమెంట్ బోర్డు నోటిఫికేషన్లు జారీచేసి, సదరు పోస్టుల ఎంపిక జాబితా ఖరారు వరకు చర్యలు తీసుకుంటోంది. ఆన్లైన్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించడశీ పోస్టింగులు ఇవ్వడశీ మాత్రం సదరు హెచ్ ఓడీల ద్వారా జరుగుతోంది. తాజాగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని 482 వైద్యుల నియామకాలు ఇదే విధంగా జరిగాయి. సరిగ్గా అదే విధానాన్ని జోనల్ల స్థాయి పోస్టుల భర్తీలోనూ అనుసరించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రిక్రూటుమెంటు బోర్డు ద్వారా గత 2024 జూన్ నుంచి మార్చి, 31 2026 వరకు 2,310 నియామకాలు జరిగాయి. త్వరలో బోధనాసుపత్రుల్లో 317 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ జరగబోతుంది.

# సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్

**మారుటేరు(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని స్థిరమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆచంట నియోజకవర్గంలోని, పెనుమంట్ర మండలం మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం నిర్వహించిన "కిసాన్ మేళా" మారుతున్న వాతావరణ పరిస్థితులు - సుస్థిర వరి వ్యవసాయం" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పరిశోధన కేంద్రంలోని ల్యాబ్ లను పరిశీలించి శాస్త్రవేత్తలతో మాట్లాడి ఆధునిక వరి వంగడాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసని ప్రత్యేక స్టాల్స్ ని పరిశీలించి, వ్యవసాయ రంగంలో ఉపయోగించే ఆధునిక యంత్రాలను స్వయంగా డ్రైవ్ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సభలో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు సాధ్యమవుతాయని, అదే సమయంలో భూమి సారాన్ని కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతింటోందని, రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చడానికి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సేంద్రియ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణ, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు అందిస్తున్నదని ఆయన వివరించారు. రైతులు ఉత్పత్తి చేసిన సేంద్రియ పంటలకు మంచి ధర లభించేలా ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందించాలంటే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రతి రైతు ఆచరించాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సేంద్రియ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని



చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలను అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నందున మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గ్రామ స్థాయిలోనే రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం ట్రాక్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును రాబోయే పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ప్రధానమంత్రి సన్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. రైతులు భూసార పరీక్షలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులు సాగు చేయడానికి ఆలోచన చేయాలన్నారు. దేశీయ వినియోగాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం ద్వారా సాగునీటి కొరత లేకుండా సాధ్యపడుతుందన్నారు.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రబీ పంట కొనుగోలుకు 7.25 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించామని వెల్లడించారు.

సభాధ్యక్షులు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయ్యాయని, ఈ సందర్భంగా కిసాన్ మేళా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ కేంద్రం ద్వారా 70 - 75 రకాల నూతన వరి వంగడాలు అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.ఆర్ శారదా జయలక్ష్మి దేవి, హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ధనుంజయరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ ఆలపాటి సత్యనారాయణ, మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ సహాయ సంచాలకులు టి.శ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి. పిచ్చయ్య, పెనుమంట్ర తహసిల్దార్ వై.రవికుమార్, మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విభాగ అధికారులు, సిబ్బంది, వ్యవసాయ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్)** : విద్యార్థులే దేశ భవిష్యత్తు అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సమాజం కోసం ఆలోచిస్తూ బాధ్యతతో పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహా సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసం గించారు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సిఆర్.రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి.రామన్ వంటి మహనీయులు తమ మేధస్సుతో ఈ విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని, అలాంటి గొప్ప వారసత్వాన్ని కొనసాగించడం విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత ముఖ్యమైందని, ఇదే భవిష్యత్తు దిశను నిర్ణయించే కాలమన్నారు. సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, సమాజానికి ఉపయోగపడే బాధ్యత విద్య అందిస్తుందని తెలిపారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందని నెల్సన్ మండేలా చెప్పిన మాటలను గుర్తుచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జ్ఞానదీపంగా ప్రకాశిస్తూ నిలవాలని, ప్రతి రంగంలో విద్యార్థులు నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తన స్నేహితుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఇక్కడే అణు భౌతిక శాస్త్రంలో ఉన్నత విద్య అభ్యసించాడని, ఈ విశ్వవిద్యాలయంలోని ఆచార్యుల గొప్పతనం గురించి ఆయన ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. యువత ధైర్యంగా కలలు కనాలని, నిరంతర కృషి, నిబద్ధతతో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. భగత్‌సింగ్ వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజం కోసం జీవించాల్సిన అవసరాన్ని వివరించారు. గుడ్డిగా ఏ సిద్ధాంతాన్నీ నమ్మవద్దని, మంచి లక్షణాలను గుర్తించి స్వీకరించాలని సూచించారు. భారతదేశం స్వయం సమృద్ధి దిశగా పయనిస్తోందని, విద్య, శక్తివంతం, ఆవిష్కరణల దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందని తెలిపారు. యువత తమ జ్ఞానాన్ని, ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే పరిష్కార మార్గాలను కనుగొనేలా మలచాలని కోరారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ గత పదకొండు నెలలుగా నిర్వహించిన సాంకేతిక, సాంస్కృతిక, అవుట్‌రీచ్ కార్యక్రమాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించే కార్యక్రమాలను పాడేరు, పార్వతీపురం ప్రాంతాల్లో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఒకే పనస చెట్టుకు 300 కాయలు విశేష ఆకర్షణ

**రామ్ మందిర్ ఏరియా**
ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :



రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో ఉన్న పనస చెట్టు ఈ ఏడాది కూడా రికార్డు స్థాయిలో ఫలదీకరణతో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సీజన్‌లో సుమారు 300 పనస కాయలు కాసిన ఈ చెట్టు, చెట్టు మొదలు నుండి కొమ్మల వరకు కాయలతో నిండిపోయి చూపరులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రత్యేక సంప్రదాయం కొనసాగింపు
జీఎం కార్యాలయ ఆవరణలో ఉన్న ఈ పనస చెట్టు కేవలం ఫలసాయానికి మాత్రమే కాకుండా, విభాగాల మధ్య సౌహార్దానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం పనస కాయలు పక్వానికి రాగానే, కార్యాలయంలోని ప్రతి విభాగానికి 3 పనస కాయల చొప్పున పంపిణీ చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ విధంగా ఏరియాలోని సిబ్బందంతా ఈ సహజ వరాన్ని ఆనందంగా పంచుకుంటున్నారు.
పర్యావరణ పరిరక్షణ ఫలితం ఈ విశేష దిగుబడికి ఫారెస్ట్రీ విభాగం చేపట్టిన సస్యరక్షణ చర్యలే కారణమని అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై తీసుకుంటున్న శ్రద్ధ వల్లే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని ఫారెస్ట్రీ విభాగం డిప్యూటీ మేనేజర్ శ్రీ కర్ణ పేర్కొన్నారు. పనస పండ్ల పంపిణీతో కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వన్యప్రాణుల దాహార్తికి ఉపశమనం ... దావనపల్లి ఫారెస్టులో సిమెంట్ తొట్టెల ఏర్పాటు




**రాయికల్** ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :
రాయికల్ మండలం దావనపల్లి గ్రామ పరిసర ఫారెస్ట్ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు మరియు అటవీ శాఖ అధికారులు కలిసి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఫారెస్ట్‌లో సిమెంట్ తొట్టెలు నిర్మించి, వాటిలో నీటిని నింపే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దావనపల్లి గ్రామ సర్పంచ్ మలవత్ ప్రసాద్, ఉప సర్పంచ్ భానోత్ రవి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నరేష్, బీట్ ఆఫీసర్ మహమ్మద్ షేక్ పాషా తదితరులు పాల్గొన్నారు. గ్రామ నాయకులు కూడా ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి సహకరించారు. వన్యప్రాణులు నీటి కోసం గ్రామాల వైపు రాకుండా, అడవిలోనే వాటికి తగిన నీటి వనరులు అందించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం వన్యప్రాణుల సంరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందచేసిన కౌన్సిలర్ చింతల వసంత



**బెల్లంపల్లి,** ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :
బెల్లంపల్లి పట్టణం లోని 15వ వార్డులో సమస్యలపై కౌన్సిలర్ చింతల వసంత మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. వార్డులో మౌలిక సదుపాయాల కొరత నూతన కరెంట్ పోల్స్ ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, గంగ పంపు లైన్ల ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే డ్వాక్రా మహిళా సంఘాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రెండు సులబ్ కాంప్లెక్స్‌ల వద్ద బోర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వీధుల్లో చెత్త నిర్వహణ కోసం తడి, పొడి, హానికర చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా వీధి దీపాలు, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రజలకు మెరుగైన వసతులు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు కౌన్సిలర్ తెలిపారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి -రవికుమార్ యాదవ్ పిలుపు



ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్) **శేరిలింగంపల్లి:**
కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మదీనాగూడ డివిజన్‌కు చెందిన 60 మంది యువకులు విష్ణు దత్ ఆధ్వర్యంలో మసీద్ బండలోని బీజేపీ కార్యాలయంలో పార్టీలో చేరగా, రవికుమార్ యాదవ్ వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనపై కేవలం 12 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ప్రజలంతా ఇప్పుడు భారతీయ జనతా పార్టీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, క్రమశిక్షణతో పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, నరేష్, ప్రవీణ్, సాయి, వేణు, సిద్ధు, వంశీ, నాగులు గౌడ్, జితేందర్, మహేష్ యాదవ్, సత్యనారాయణ రాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.ద

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి ఈశ్వర్



**పెగడపల్లి** ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్)
జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఆరవెల్లి గ్రామానికి చెందిన యువకులు గాలి పెల్లి ఆదిత్య, శ్రీరామ్ విగ్నేష్ ఇద్దరు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరవెల్లి గ్రామ సర్పంచ్ ఉప్పులంచ భవాని- లక్ష్మణ్, లింగాపూర్ సర్పంచ్ కాసెట్టి వీరేశం, నాయకులు తిరుమణి నరసింహారెడ్డి, మడిగల తిరుపతి, నాగుల రాజశేఖర్ గౌడ్, అందే వెంకటేశం, గాలి పెల్లి సత్యం, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ అభివృద్ధికి ముందడుగు

-కీలక ప్రతిపాదనలకు కమిటీ గ్రీన్ సిగ్నల్
-లింగంపల్లి ఆర్ఓబీ, రహదారుల విస్తరణకు ఆమోదం
-పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపునకు నిర్ణయం
-పర్యావరణ హితంగా విద్యుత్తు వాహనాల కొనుగోలు
-పాల్గొన్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్

(జర్నలిస్ట్ ఫైల్) **సైబరాబాద్:**
సైబరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మొత్తం 15 కీలక ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. మాదాపూర్‌లోని ఎన్ఏసీ భవనంలో మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అధ్యక్షతన, కమిషనర్ సృజన సమక్షంలో జరిగిన రెండో స్టాండింగ్ కమిటీ సమావేశంలో 12 ప్రధాన, 3 అదనపు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పచ్చజెండా ఊపారు. ముఖ్యంగా లింగంపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రధాన రహదారుల విస్తరణ, వరద నీటి కాలువలు, సీసీ మరియు వీడీసీసీ రోడ్ల పనులతో పాటు అధికారిక అవసరాల కోసం విద్యుత్తు వాహనాల కొనుగోలుకు నిర్ణయించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారి వేతనాలను పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో పాటు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పార్కుల అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పునరుద్ధరణ, ప్రజారోగ్యం కోసం ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుకు కమిటీ ఆమోదముద్ర వేసింది. రహదారుల విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్తు లైన్ల మార్పు, మెరుగైన పాలన కోసం అధికారాల వికేంద్రీకరణ వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, మంజూరైన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జయేశ్ రంజన్ ఆదేశించారు. ఈ క్రమంలోనే



పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని కీలక జంక్షన్ల సుందరీకరణ, అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. తద్వారా సైబరాబాద్ ప్రాంతాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సుస్థిర స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ఈ కీలక నిర్ణయాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం అని వారు వివరించారు.

# 27 ఏళ్లుగా అదే 'వృత్తి': వాహన చోరుడి అరెస్ట్

(జర్నలిస్ట్ ఫైల్) **సైబరాబాద్:**
దాదాపు మూడు దశాబ్దాలుగా ద్విచక్ర వాహనాల చోరీలనే వృత్తిగా మార్చుకున్న ఓ పాత నేరస్థుడిని సైబరాబాద్ కమిషనరేట్ లోని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ. 3.50 లక్షల విలువైన 7 బైకులను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ ఏసిపి సిహెచ్ శ్రీధర్, సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం సరూర్‌నగర్ బృందావన్ కాలనీకి చెందిన వరాల మురళీధర్ రావు అలియాస్ మురళి (44) 1999 నుంచి నేర ప్రవృత్తిని కొనసాగిస్తూ వరుసగా వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇళ్ల ముందు, రైల్వే స్టేషన్ల పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపి ఉంచిన బైకులను నకిలీ తాళాలతో సులువుగా




తెరిచి దొంగిలించడంలో ఇతను ఆరితేరాడు. మాదాపూర్ లోని చందా నాయక్ తండా రోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా గస్తీ పోలీసులు ఇతనిని పట్టుకోగా, విచారణలో నిందితుడు తన నేరాలను అంగీకరించాడు. ఇతని సమాచారం మేరకు హైటెక్ సిటీ ఎంఎంటీఎస్ స్టేషన్ సమీపంలో దాచిన 7 దొంగతనపు బైకులను పోలీసులు రికవరీ చేశారు. నిందితుడిపై మాదాపూర్, సరూర్‌నగర్, కేపీహెచ్‌బీ, మధురానగర్, భోంగీర్, చర్లపల్లి, సనత్‌నగర్ స్టేషన్లలో తాజా కేసులు నమోదు కాగా, 1999 నుంచి ఇప్పటివరకు ఇతనిపై దాదాపు 14 పాత కేసులు ఉన్నట్లు గుర్తించారు. సుదీర్ఘకాలంగా నేరాలకు పాల్పడుతున్న ఈ నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న మాదాపూర్ క్రైమ్ టీమ్ సభ్యులను సైబరాబాద్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

ఇంటిపనులతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
కౌన్సిలర్ చింతల వసంత

**బెల్లంపల్లి,** ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :
వరల్డ్ హెల్త్ డే సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని 15వ వార్డులోని అంగన్వాడీ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కౌన్సిలర్ చింతల వసంత పాల్గొని గృహిణిలతో అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం బాగుంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇంటి పనులతో బిజీగా ఉన్న గృహిణులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజువారీ వ్యాయామం చేయడం, మరియు అవసరమైనప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని



సూచించారు. అదేవిధంగా పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యంపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో



టీచర్ పద్మ, ముత్యాలు, ఆయా కమలతో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో క్రీడా స్ఫూర్తిని నింపాలి..

- అతిథులను సన్మానించిన క్రికెట్ టోర్నమెంట్ మేనేజ్మెంట్..

**సింగరేణి** ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :
సింగరేణి మండలం,ఉసిరికాయలపల్లి శ్రీ కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నటువంటి వైరా ఇల్లందు నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పర్స పట్టాభి రామారావు ఆశీస్సులతో శ్రీ గణేష్ అడ్వాన్స్ డెంటల్ కేర్ ఆసుపత్రి యజమాని మరియు డాక్టర్ బాలసాని వినయ్ గౌడ్ సౌజన్యంతో నిర్వహిస్తున్నటువంటి టోర్నమెంట్ విజయవంతంగా మూడో రోజుకి చేరింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలసాని వినయ్ గౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి నైపుణ్యాన్ని వెలికితీయడానికి గ్రామ స్థాయిలో క్రీడా స్ఫూర్తి నింపడానికి ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం మంచిదన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో ఇటువంటి యువత క్రీడలతోపాటు చదువు సామాజిక బాధ్యత వెలువడాలని క్రీడా స్ఫూర్తి సమయ పాలన జట్టు సమన్వయం గా కలిసికట్టుగా విజయాన్ని అందిపుచ్చుకునే నైపుణ్యం వెలువడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లలిత కళామందిర్ ప్రోపరేటర్ సుదర్శన్ గౌడ్ సర్పంచులు ఉప సర్పంచ్లు గ్రామ పెద్దలు జట్టు సభ్యులు క్రీడాకారులు క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# పెబ్బేరు ప్రెస్ క్లబ్‌కు సొంత భవనం స్లాబ్ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు





- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందినది పెబ్బేరు ప్రెస్ క్లబ్
- నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి
- ప్రెస్ క్లబ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన మున్సిపల్ చైర్మన్
- మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, ప్రెస్ క్లబ్ సభ్యులు

**పెబ్బేర్ వనపర్తి జిల్లా ప్రతినిధి**
ఏప్రిల్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :
పెబ్బేరు పట్టణంలోని పాత్రికేయుల కలగా నిలిచిన ప్రెస్ క్లబ్ నూతన భవనం నిర్మాణం కీలక దశకు చేరుకుంది. నిర్మాణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం ప్రెస్ క్లబ్ పనులను ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం నిర్మాణం వేగం అందుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన పెబ్బేరు ప్రెస్ క్లబ్‌కు గత కొన్ని దశాబ్దాలుగా సొంత భవనం అవసరం తీవ్రంగా అనిపిస్తూనే ఉంది. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ విప్‌గా పనిచేసిన రావుల చంద్రశేఖర్ రెడ్డి పాత్రికేయుల సేవలను గుర్తించి భవనం కేటాయించగా, దాదాపు 25 సంవత్సరాలుగా అదే భవనంలో ప్రెస్ క్లబ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అయితే ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో, భద్రతా సమస్యలు తలెత్తాయి. దీంతో కొత్త భవనం నిర్మాణం అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. గత పాలకవర్గం కేటాయించిన స్థలంలోనే నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా స్లాబ్ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్‌కు సొంత భవనం నిర్మాణం జరగడం పాత్రికేయుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. భవనం పూర్తయిన తరువాత ఇది కేవలం కార్యాలయంగా మాత్రమే కాకుండా, పాత్రికేయుల అభివృద్ధికి, సమావేశాలకు, శిక్షణా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, కౌన్సిలర్లు హరి శంకర్ నాయుడు, తాటికొండ కృష్ణ, శివ సాయి, మన్యం, కాంగ్రెస్ నాయకులు షకీల్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్, కాంట్రాక్టర్ మోతే రాములు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ హబ్‌లో హైడ్రా భారీ యాక్షన్.. బడా రియల్టర్ల చెర నుంచి భూమి విముక్తి



-ఆర్‌సీసీ ప్లాంట్లు, తాత్కాలిక షెడ్ల తొలగింపు..
రికార్డు స్థాయిలో ప్రభుత్వ భూమి రక్షణ
-రూ.1200 కోట్ల భూమి స్వాధీనం

(జర్నలిస్ట్ ఫైల్) **సైబరాబాద్:**
నగరంలోని ఐటీ కారిడార్ సమీపంలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించి సుమారు రూ. 1200 కోట్ల విలువైన ఎనిమిది ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. సైబరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్ 55లో బడా రియల్ ఎస్టేట్ సంస్థల కబ్జాలో ఉన్న 4.20 ఎకరాలతో పాటు కొలను మాధవరెడ్డి కుమార్తె సబిత ఆధీనంలో ఉన్న మరో నాలుగు ఎకరాల భూమిని అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గతంలోనే రంగారెడ్డి కలెక్టర్ ఈ భూమిని నిషేధిత జాబితాలో చేర్చినప్పటికీ, మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ అది తమదేనని వాదించగా, వాసవి నిర్మాణ సంస్థ అక్కడ ఆర్.సి.సి ప్లాంటును, కార్మికుల కోసం షెడ్లను ఏర్పాటు చేసింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు అది ప్రభుత్వ భూమిగా తేలడంతో ఆక్రమణలను తొలగించారు. వాసవి సంస్థ స్వయంగా తన ఆర్.సి.సి ప్లాంటును తొలగించుకోగా, హైడ్రా




సిబ్బంది ఇతర తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గతంలోనూ ఇదే సర్వే నంబర్ పరిధిలోని మొండికుంట వద్ద 11 ఎకరాల వరకు ఆక్రమణలను తొలగించిన హైడ్రా, తాజా చర్యతో ఐటీ హబ్ సమీపంలోని అత్యంత ఖరీదైన భూమిని తిరిగి ప్రభుత్వ పరం చేసింది.

## నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థినికి జాతీయ స్థాయి గౌరవం



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులో ఉన్న నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన విద్యార్థిని జి. స్నేహ జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి అరుదైన గౌరవాన్ని అందుకుంది. ప్రస్తుతం బి.ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న స్నేహ, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యకర్తగా గుర్తింపు పొందింది.

దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ 2026' కార్యక్రమంలో 12 లక్షలకుపైగా మంది పాల్గొనగా, వారిలో స్నేహ ఫైనల్ రౌండ్‌కు ఎంపిక కావడం విశేషం. ఈ ఫైనల్ దశలో భాగంగా భారత ప్రధానమంత్రితో జాతీయ స్థాయి వర్చువల్ సంభాషణలో పాల్గొనే అవకాశాన్ని ఆమె దక్కించుకుంది. ఈ కార్యక్రమం ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించనున్నారు.

ఈ విజయంతో స్నేహ తన ప్రతిభ, విశ్లేషణా సామర్థ్యం, దేశాభివృద్ధిపై తన అభిప్రాయాలను జాతీయ వేదికపై ప్రదర్శించనుంది.

ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ రేవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డా. బి. పాముల రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. నరేష్ బాబు రేఖా, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు స్నేహను అభినందించారు.

## మిర్చి యార్డును సందర్శించిన డిఎఫ్ఓ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**

గుంటూరు మిర్చి యార్డును జిల్లా విపత్తుల నిర్వహణ అగ్నిమాపక శాఖ అధికారి ఎం శ్రీనివాసరెడ్డి బుధవారం సందర్శించారు. అగ్నిమాపక యంత్రాల పనితీరును మిర్చి యార్డులో తనిఖీ చేశారు.

# మహిళల గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

- తల్లిని, చెల్లిని గెంటేసి నీతులు చెబుతారా ?
- మావిగన్ పేరిట పిచ్చి ఆలోచనలు
- అమరావతి పేరులోనే వైబ్ ఉంది
- సచివాలయ సిబ్బంది జవాబుదారీగా పని చేయాలి
- శానిటేషన్ పై అలసత్వాన్ని సహించం
- వినోభానగర్, రెడ్ల బజార్, మారుతినగర్ ప్రాంతాల్లో పర్యటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : తల్లిని, సొంత చెల్లిని అవమానపరిచిన జగన్ మహిళల గురించి మాట్లాడటం, నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. బుధవారం ఉదయాన్నే గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వినోభానగర్, రెడ్ల బజార్, మారుతీనగర్, నందివెలుగు ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. కనీస అవగాహన లేకుండా రాజధాని ప్రాంతాన్ని మావిగన్ పేరిట పిచ్చి ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ సైకోసైన్యం రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఏబీఎన్–ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై దాడులు చేయడం వైసీపీ విపరీత మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. అమరావతి రాజధాని పేరులోనే వైబ్ ఉందని, ప్రపంచమే మెచ్చిన ప్రాంతమని స్పష్టం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, కానీ అధికార యంత్రాంగం బాధ్యతగా పని చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బందిలో కొంత జవాబుదారీతనం లోపించిందని, దీనిని సరిదిద్దుకోవాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ఏ అవసమొచ్చినా కూటమి నాయకులు నా దృష్టికి తీసుకురావాలని, 24 గంటలపాటు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల కాలంలో నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం తట్టమట్టి కూడా వేయలేదని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రసహాయమంత్రి పెమ్మసాని సహాయంతో నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేస్తున్నామని తెలిపారు. తొలుత వినోభా నగర్ ప్రాంతంలో శానిటేషన్ సక్రమంగా లేకపోవడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. యుద్ధప్రాతిపదిక కాలువలు శుభ్రం చేయించాలని ఆదేశించారు.

## బ్యాక్ లాగ్ పోస్టులకు 15 వరకు గడువు పొడిగింపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతుల నుండి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు.

ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ శాఖలలో వివిధ కేటగిరిలకు రిజర్వు చేసిన 38 బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఏప్రిల్ 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించవచ్చని అన్నారు.

ఈ బ్యాక్ లాగ్ ఉద్యోగాల మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనా వెబ్ సైట్లో చూడవచ్చని తెలిపారు. వివరాలకు 0863 2323329 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని చెప్పారు.

## విధులుబహిష్కరించి నిరసన తెలిపిన న్యాయవాదులు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక కొత్తపేటలోని కోర్టు ప్రాంగణంలోబుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి,తమ నిరసన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన న్యాయవాది ఎల్లయ్యను దుండగులు అతికిరాతకంగా, హత్య చేయడాన్ని తీవ్రంగానిరశిస్తు విధులు బహిష్కరించి, న్యాయవాది ఎల్లయ్యకు సంఘీభావంగా కోర్ట్ ప్రాంగణం,ప్రధాన ద్వారం వద్ద నల్ల బ్రాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులకు రక్షణ చట్టాల్ని తీసుకురావాలని, అలాగే న్యాయవాదుల మీద జరిగేటువంటి దాడులను ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా విచారించి, త్వరితగతిన నిందితులకి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా న్యాయవాదుల మిద జరిగే దాడులను తీవ్రంగా మేధావి వర్గాలు ఖండించాలని న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని,చనిపోయి న్యాయవాది కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని,అలాగే నిందితుని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్ సీనియర్ న్యాయవాదులు తాడి బోయిన శ్రీనివాసరావు రాతం శెట్టి సుబ్బారావు షేక్ కరీమూన్, మధిర సురేష్ కుమార్, ఆర్ వెంకటేశ్వరావు, గ్రంధి జయరామకృష్ణ,స్టాలిన్,షేక్ శంషాబాష, రవికృష్ణ, వెంకటేశ్వరరావు, చందు మోహన్ గాంధీ,శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితర న్యాయవాదులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యాల కల్పనకు టెండర్ ప్రక్రియద్వారా లైసెన్సులు ఆమోదం



- ఆలయ ఇఒ, వి. అనుపమ

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం వైకుంఠపురంలో, భక్తులకు అవసరమయ్యే 6,అంశాలకు, టెండర్ ప్రక్రియ ద్వారా లైసెన్స్ హక్కు కల్పించినట్లు ఆలయ సహాయ కమీషనర్ వి. అనుపమ పేర్కొన్నారు.

స్థానిక వైకుంఠపులంలో బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి ఎమ్. వెంకటేశ్వరరావు సమక్షంలో, ఆలయ సహాయ కమీషనర్ వి. అనుపమ నిర్వహించిన,సీల్డ్ టెండర్ కం, బహిరంగ వేలం ద్వారా,ఆలయ ప్రాంగణంలో, ఫ్యాన్సి వస్తువులు, బొమ్మలు అమ్ముకొనుటకు, వాహనముల పార్కింగ్ ఫీజు వసూలు కొరకు, క్యాటరింగ్, గ్యాస్ పొయ్యిల నిర్వాహణ, పాదరక్షలు భద్రపరచుట, కూల్ డ్రింకులు విక్రయించుట, ఈ ఆరుఅంశములకు లైసెన్స్ హక్కు కల్పించారు. ఈసందర్భంగా ఆలయ సహాయ కమీషనర్ వి. అనుపమ మాట్లాడుతు టెండర్ ప్రక్రియ ద్వారా లీజు లైసెన్స్ కల్పించే విషయంలో, పార్కింగ్ కు, గతం కంటే, 2లక్షల వరకు పాట పెరిగినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం స్టూడెంట్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడిగా రాకేశ్

- విద్యార్థుల పక్షాన సమన్వయకర్తగా నందన్ చౌదరి
- 2026-27 సంవత్సరానికి నూతన కౌన్సిల్ ఎంపిక



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడిగా శెట్టిపల్లి రాకేశ్ ఎంపికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ గా వేదాంశ్. ప్రధాన కార్యదర్శిగా కొమ్ముపల్లి సాత్విక్, కోశాధికారిగా హర్షితారెడ్డిలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం ఉదయం అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో జరిగిన పాత కౌన్సిల్ వీడ్కోలు కార్యక్రమంలో యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య చెట్లపల్లి సతీష్ కుమార్ నూతన కమిటీని ప్రకటించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నేరుగా వైస్ ఛాన్సలర్ దృష్టిలో పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేసే సమన్వయకర్తగా నందన్ చౌదరిని వీసీ సతీష్ కుమార్ స్వయంగా ఎంపిక చేశారు. ఏడాది కాలం పాటు వీరు స్టూడెంట్ కౌన్సిల్ వ్యవహారాలను, వివిధ స్టూడెంట్స్ క్లబ్స్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారని వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి హోదాల్లో బాధ్యతల్ని నిర్వర్తించిన విద్యార్థి సంఘ నాయకులు నివేదా శ్రీరామ్, రిషబ్ రంజన్, సాయి నితిన్ రెడ్డి తదితర కోర్ కమిటీ సభ్యులతో పాటు వివిధ క్లబ్ ల కార్యవర్గ సభ్యులందరికీ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వీరికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

**నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలిలి- వీసీ :** చదువుతో పాటు విద్యార్థులు సమర్ధవంతమైన నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని, యూనివర్సిటీ అభివృద్ధికి సహకారం అందించాలని వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. నివేదా శ్రీరామ్ టీమ్ లోని ప్రతి ఒక్కరూ బాగా పనిచేశారనీ, క్లిష్ట సమయంలోనూ మంచి సహకారాన్ని అందించారని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో రెజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూర్, విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్ సింగ్ నారంగ్, అసోసియేట్ డైరెక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలివేటి కృష్ణయ్య




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**

సామాజిక అధ్యయనం లేకుండా ఇన్నర్ ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రభుత్వం భూసేకరణకు పూనుకోవటం సరికాదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలివేటి కృష్ణయ్య అన్నారు. రింగ్ రోడ్ నిర్మాణ ప్రక్రియలో భూములు కోల్పోతున్న రైతుల అవగాహన సదస్సు బుధవారం రాత్రి రూరల్ గ్రామం గుడివాడ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబి రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని,మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం భూసేకరణకు పాల్పడుతుందన్నారు. ఏళ్ల తరబడి సాగు చేస్తూ జీవనాధారంగా ఉన్న భూములను ప్రభుత్వం అనాలోచితంగా సేకరించి,రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతుందని ఆరోపించారు. భూముల ధరలు క్రమంగా పెరుగుతూ, ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతూ ఉంటే భూములు ఇచ్చిన రైతులు దిగాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్ ఇన్నర్ రింగ్ రోడ్డు కొరకు ప్రభుత్వం సేకరిస్తున్న భూములపై రైతులకు అవగాహన ముఖ్యమన్నారు. 2013 భూసేకరణ చట్టానికి సంబంధించిన వివరాలను ఆన్లైన్లో యువత పరిశీలించి రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వం భూసేకరణ చట్టానికి తూట్లు పొడుస్తూ రైతులను మోసగించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. వాస్తవానికి ఔటర్ రింగ్ రోడ్ వెడల్పు 70 మీటర్లు సరిపోతుందని, 8 లైన్ల రోడ్ రోడ్డు నిర్మాణానికి పుష్కలమని చెప్పారు. కానీ 250 మీటర్ల వెడల్పును ప్రతిపాదించడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గత ఏడాది డిసెంబర్ లో భూసేకరణకు ఇచ్చిన నోటిఫికేషన్ లో కేవలం 25 రోజులు గడువు మాత్రమే ఇచ్చారని, ఇది సామాజిక అధ్యయనానికి చాలదన్నారు. వాస్తవానికి ప్రభుత్వం భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణకు సంబంధించి సామాజిక అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కనీస నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న ప్రభుత్వం తీరుపై రైతులు అప్రమత్తంగా ఉండి ఈ పరిస్థితులను ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రైతులు ముందుకు వస్తే వారి పక్షాన రైతు సంఘం పోరాటం చేస్తుందని అన్నారు. ఈనెల 21న విజయవాడలో ఐదు జిల్లాల స్థాయి సమావేశం జరుగుతుందని, మరింత లోతుగా భూసేకరణ పై ప్రభుత్వం అనుసరించే రైతు వ్యతిరేక విధానాలను వివరించే అవకాశం ఉంటుందని, రైతులు తరలి రావాలన్నారు. మాజీ వ్యవసాయ మంత్రి సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచు మాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇన్నర్ ఔటర్ రింగ్ రోడ్డు భూసేకరణ ప్రక్రియ పూర్తిగా లోపబోయిష్టంగా ఉందని చెప్పారు. వాస్తవానికి భూములు కోల్పోతున్న రైతుల వివరాలను కూడా ప్రభుత్వం గోప్యంగా ఉంచి భూసేకరణకు పాల్పడుతుందన్నారు గ్రామ సభల ద్వారా ప్రజల్లో భూసేకరణ పై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం దానికి తిలోదకాలిస్తుందని చెప్పారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ప్రైవేట్ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాలలో రైతులు భూములు కోల్పోతే పరిహారం మరింత పెంచాలన్నారు. ములకా శివ సాంబి రెడ్డి మాట్లాడుతూ విజయవాడలో ఈ నెల 21న జరిగే గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ , ఏలూరు జిల్లాల స్థాయిలో రైతు సంఘం నిర్వహించే సమావేశంలో భూములు కోల్పోతున్న రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతులు బిక్కీ శ్రీనివాసరావు, పోతురాజు వసుంధర, అన్ని రమేష్ బాబు, నన్నపనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## న్యాయ వ్యవస్థకు వన్నె తెచ్చేలా పని చేయాలి



కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ): తొలి ప్రయత్నం లోనే జడ్జి గా ఎంపికవడం పట్ల భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ తెలిపారు. బుధవారం జూనియర్ సివిల్ జడ్జి గా ఎంపికైన షేక్ రేష్మ ను బీజేపీ నాయకులు ఖుద్దుస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేష్మ ను ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం ఖుద్దుస్ మాట్లాడుతూ లక్ష్యాలు నెరవేర్చుకొనుటకు కష్ట పడి సాధన తప్పనిసరి అన్నారు. ఎన్నో కష్టాలను దాటుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవడం అభినందనీయం అన్నారు. నేడు ఆధునిక యువతరానికి రేష్మ జీవితం ఆదర్శం అని తెలిపారు. బాధ్యతల అనంతరం న్యాయవ్యవస్థకు వన్నె తెచ్చే విధంగా బాధ్యతలు నిర్వార్తించాలని కోరారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ తాన ఎదుగుదలకు తన కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు మరువలేనివన్నారు. వారి ప్రోత్సాహం తోనే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని తెలియజేసారు.

# ప్రధాని మోదీ సహకారంతోనే అమరావతికి రాజధాని హోదా: చెరుకూరి తిరుపతిరావు





**తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర రాజధానిగా అమరావతికి రాష్ట్రపతి ఆమోదం లభించడం వెనుక కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ కృషి ఎంతో ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజల తరఫున కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

స్థానిక గంగానమ్మపేటలోని నటరాజ్ జ్యువెలర్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీజేపీ కార్యాలయాన్ని బుధవారం చెరుకూరి తిరుపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అమరావతి గెజిట్‌కు రాష్ట్రపతి ఆమోదం లభించి అమలులోకి వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా, మండల స్థాయి నాయకులు కూటమి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

సందర్భంగా మీడియాతో మాట్లాడిన చెరుకూరి తిరుపతిరావు, బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పోటీలో ఉంటుందని వెల్లడించారు. నామినేటెడ్ పదవులు పొందిన నాయకులను దుశ్శాలువలతో సత్కరించి అభినందించారు.

రాష్ట్రంలోని కూటమి పాలకులకు, నాయకులకు, ప్రజలకు తమ హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలో నియోజకవర్గ కార్యాలయం, రూరల్ మండలంలో కార్యాలయాల ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కఠారి వాసుదేవనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి తమిరిశ అనంతాచార్యులు, మండల అధ్యక్షులు గోళ్ళ దేవరాజు, కడియాల నందకిషోర్, యర్రంరాజు సందీప్ రాజు, గోవాడ కృష్ణచైతన్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ముఖ్యమంత్రితో ప్రపంచ బ్యాంక్ బృందం భేటీ



- అమరావతిలో భారీగా పెట్టుబడులకు అవకాశముందన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు
- రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్ గా మారుతుందని అభిప్రాయపడ్డ వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు
- అమరావతి సహా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. అమరావతి నిర్మాణ ప్రగతిని ప్రతినిధి బృందం ప్రశంసించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటీ–విద్యుత్ రంగ సంస్కరణల వల్ల ఈ నగరం భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తుందని ప్రపంచ బ్యాంకు బృందం అభిప్రాయపడింది. రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్ గా మారుతుందని వెల్లడించింది.

మౌలిక సదుపాయాల అభివృద్ధితో వాణిజ్య కార్యాకలాపాలకు అమరావతి కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నట్టు బృంద ప్రతినిధులు ముఖ్యమంత్రితో చెప్పారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా తాము పని చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంక్ బృందానికి సీఎం చంద్రబాబు వివరించారు. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు.

## దేవాదాయ శాఖలో అవినీతి విశ్వరూపం..!



- అవినీతిలో చక్రం తిప్పిన ఏసి
- నాలుగేళ్లలోనే అన్ని కోట్ల సంపాదన ఎలా సాధ్యం
- కార్లు, ప్లాట్లు, భారీగా బంగారాన్ని గుర్తించిన ఏసీబీ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్):** అక్రమాస్తుల కేసులో అరెస్టు అయిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) శాంతి ఆస్తుల చిట్టా అవినీతిలో కొత్త రికార్డులు నమోదు చేసిందని టాక్ వినిపిస్తోంది. ఉద్యోగంలో చేరిన కేవలం నాలుగేళ్లలోనే ఏసీ శాంతి భారీగా ఆస్తులు కూడగట్టారని ఏసీబీ అధికారులు గుర్తించారు. లగ్జరీ ప్లాట్లు, కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించిన శాంతి ఇప్పటివరకు నమోదైన అవినీతి కేసుల్లో కొత్త రికార్డు నెలకొల్పారని వ్యాఖ్యానిస్తున్నారు. రెండు రోజుల క్రితం శాంతి, ఆమె కుటుంబ సభ్యుల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించినట్లు గుర్తించి అరెస్టు చేశారు.

దేవాదాయశాఖలో ఏసీ శాంతి వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లలోనే ఆమె రికార్డు స్థాయిలో ఆస్తులు పోగేసుకున్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శాంతి అక్రమాస్తుల లిస్టు చూస్తే ఆమె ఇంత డబ్బు ఎలా సంపాదించారనేది అంతుచిక్కడం లేదని అంటున్నారు.

2020లో దేవాదాయశాఖ ఏసీగా విశాఖలో ఉద్యోగంలో చేరిన శాంతి 2024 జూన్ నుంచి సస్పెన్షన్ లో ఉన్నారు. రెండు రోజుల క్రితమే ఆమెపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. సస్పెండ్ అయిన ఏడాదిలోగా చర్యలు తీసుకోకపోతే పోస్టింగు ఇవ్వాలనే నిబంధనలతో హైకోర్టు ఆ తీర్పు ఇచ్చింది. దీంతో ప్రభుత్వం సైతం శాంతిపై విధించిన సస్పెన్షన్ ను ఉపసంహరించుకుంది. ఇంతలోనే ఆమె అక్రమాస్తులపై ఏసీబీ పంజా విసిరింది.

గత రెండు రోజుల క్రితం విశాఖపట్నం, తాడేపల్లిలో ఆకస్మిక తనఖీలు చేసిన ఏసీబీ అధికారులు శాంతికి చెందిన పలు ఆస్తులు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. విశాఖలో త్రీబెడ్ రూం ప్లాట్, తాడేపల్లిలో మూడు అంతస్థుల విల్లా, సుమారు 770 గ్రాముల బంగారం, మూడు కిలోల వెండి, ఖరీదైన కారు, మోటార్ సైకిళ్లు, ఎలక్ట్రినిక్ వస్తువులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇవన్నీ అక్రమంగా సంపాదించినవే అంటూ ఆరోపిస్తున్నారు. 2020లో ఏపీపీఎస్సీ ద్వారా దేవాదాయశాఖలో ఉద్యోగం సంపాదించిన శాంతి విశాఖ అసిస్టెంట్ కమిషనర్ గా ఫస్ట్ పోస్టింగ్ దక్కించుకున్నారు.

న్యాయవాద వృత్తిని చదివి హైదరాబాద్ లో కొన్నాళ్లు పనిచేసిన శాంతి ఓ సూట్ కేసుతో విశాఖలో అడుగు పెట్టినట్లు చెబుతున్నారు. తొలుత ఓ చిన్నగదిని అద్దెకు తీసుకుని ఆ తర్వాత పెద్ద ఇంటికి మారారని, కొద్దిరోజుల్లోనే మూడు పడక గదుల విలాసవంతమైన భవనాన్ని కొనుగోలు చేశారని ఆరోపిస్తున్నారు.

ఏ ప్రభుత్వ ఉద్యోగి సంపాదించలేని విధంగా అసాధారణ ఆస్తులు సంపాదించి ఏసీ కొత్త రికార్డు నమోదు చేశారని వ్యాఖ్యానిస్తున్నారు. దేశంలో అత్యున్నతస్థాయి అధికారుల నాలుగేళ్ల జీతం లెక్క వేసినా ఇంత సంపాదన ఉండదని అంటున్నారు. విశాఖనగరంలోని విలువైన దేవాదాయ భూములను అడ్డుపెట్టుకుని శాంతి భారీగా డబ్బు సంపాదించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశాఖలో పనిచేసిన సమయంలో ఏసీ శాంతిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి.

అయితే అప్పటి అధికార పార్టీ అండదండలతో ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే శాంతిని పక్కన పెట్టింది. ఇప్పటివరకు ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. అదే సమయంలో ఆమెతో నిర్బంధ ఉద్యోగ విరమణ చేయించాలని ప్రయత్నాలు జరిగాయని అంటున్నారు.

అయితే సచివాలయం స్థాయిలో ఆ ఫైలు నిలిపివేశారని అంటున్నారు. మొత్తానికి తాజా అరెస్టుతో శాంతి వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ గా మారుతోంది.

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో బీజేపీ అధ్యక్షులు మాధవ్ భేటీ

- మత్స్యకారులు, హోంగార్డుల సమస్యలపై వినతి





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ అమరావతిలో బుధవారంకలసి మత్స్యకారులు, హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ నెల్లూరు, ఒంగోలు, బాపట్ల తీర ప్రాంతాల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు అక్రమంగా ప్రవేశిస్తూ స్థానిక మత్స్యకారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని వివరించారు. స్పీడ్ బోట్లతో వచ్చి మత్స్య సంపదను దోచుకోవడం, స్థానికుల వలలు, పడవలను ధ్వంసం చేయడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. ఈ పరిణామాల వల్ల స్థానిక మత్స్యకారుల్లో భయాందోళనలు పెరిగి, శాంతిభద్రతలకు భంగం కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమ బోట్లను స్థానికులు పట్టుకున్నప్పటికీ, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకుండా విడుదల చేయడం అనుమానాలకు తావిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తీరప్రాంత భద్రతను బలోపేతం చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర విభజన తర్వాత సుమారు 400 మంది హోంగార్డులు తమ స్వగ్రామాలకు దూరంగా విధులు నిర్వర్తిస్తున్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్--తెలంగాణ రాష్ట్రాల మధ్య పరస్పర బదిలీలు చేపట్టి వారికి ఉపశమనం కల్పించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు.

## వేమూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

- 'మీ భూమి-మీ హక్కు'లో భాగంగా రైతులకు పట్టాదారు పుస్తకాలు అందించనున్న సీఎం
- ఇప్పటి వరకూ 22.79 లక్షల పట్టాదారు పుస్తకాలు రైతులకు అందజేత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం బాపట్ల జిల్లా, వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే తప్పుల తడకగా ఉండటంతో కూటమి ప్రభుత్వం ఆ తప్పులను సరి చేస్తోంది. గత ముఖ్యమంత్రి పొలం హద్దుల కోసం పాతే రాళ్లపైనా, రైతులకు ఇచ్చే పట్టాదారుపుస్తకాలపై తన ఫోటోలను ముద్రించుకున్నారు. వీటన్నింటినీ కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 6,976 గ్రామాల్లో సర్వే పూర్తైంది. ఈ ఏడాది చివరి నాటికి రీ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించుకుంది. దీంతో పాటు ఈ ఏడాది ప్రారంభం నుంచి ప్రభుత్వం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను రాజముద్రతో అందిస్తోంది. జనవరి నెలలో 4,783 గ్రామాల్లో 18.77 లక్షల పాస్ పుస్తకాలు, ఫిబ్రవరిలో 279 గ్రామాల్లో 1,16,129 పాస్ పుస్తకాలు, మార్చిలో 299 గ్రామాల్లో 1,29,298 పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించింది. జనవరి నుంచి 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు ప్రభుత్వం అందించింది. మార్చి 2027 నాటికి 7,518 సిగ్నల్ గ్రామాల్లో 47,02,000 పాస్ పుస్తకాలు, ఏప్రిల్ 2027 కల్లా 2,438 నాన్ సిగ్నల్ గ్రామాల్లోని 15,02,000 పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మొత్తంగా 9,956 గ్రామాల్లో 62,04,000 పాస్‌బుక్స్ కొత్తవి ఇవ్వాల్సి ఉంది. బాపట్ల జిల్లాలోని 8 మండలాల్లో 3,658 పాస్ పుస్తకాలు, అలాగే వేమూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 1,795 పాస్ పుస్తకాలను గురువారం పంపిణీ చేయనున్నారు. అంతేకాదు... రైతులకు తెలియకుండా భూ రికార్డులు మార్పిడి చేయలేని విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్లాక్ చైన్ టెక్నాలజీని అమల్లోకి తెస్తోంది. ఈ విధానం ద్వారా రికార్డులు ట్యాంపర్ చేయాలన్నా, తారుమారు చేయాలన్నా అసాధ్యం.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేమూరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా... ఉదయం 10.50 గంటలకు భట్టిప్రోలు మండలం, సూరేపల్లికి చేరుకుంటారు. 11.00 గంటలకు సూరేపల్లిలో నిర్వహించే ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.35 గంటలకు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడతారు. 02.10 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 04.05 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## నేతన్నల గౌరవ జీవనమే లక్ష్యం : మంత్రి సవిత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** చేనేత కార్మికులకు గౌరవ జీవనం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 26న నిర్వహించే పద్మ శాలీ మహాసభకు హాజరుకావాలని ఆ సంఘ ప్రతినిధులు మంత్రి సవితను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేతలకు కూటమి ప్రభుత్వంతోనే మేలు జరుగుతోందన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు రూ.4 వేల పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ఏటా రూ.5 కోట్ల మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు కేటాయిస్తున్నామన్నారు. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చి, రాష్ట్ర వ్యాప్తంగా మెగా క్లస్టర్లు, మినీ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. . 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందజేశారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించామన్నారు. నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. నేతన్నలు గౌరవ ప్రద జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత..పద్మ శాలీ మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు మునగపాటి వెంకటేశ్వరరావు, అంజిబాబు, విజయనాగేంద్ర, బండారు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాప్టో మలిదశ పోరాటం : ఏప్రిల్ 9న స్పాట్ కేంద్రంలో నిరసన

**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) మలిదశ పోరాటంలో భాగంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 9న నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నాయకులు బుధవారం తెలిపారు. కర్నూలు నగరంలోని ఎ.క్యాంప్ ప్రాంతం మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి స్పాట్ కేంద్రంలో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి ఈ నిరసన చేపట్టనున్నారు.

జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎం మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ జనరల్ జి. భాస్కర్ మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులంతా ఈ నిరసనలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఫ్యాప్టో కో–ఛైర్మన్ కె. ప్రకాష్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి. హృదయరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన వంటి కీలక అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయని విమర్శించారు. పంచాయతీరాజ్ శాఖలో కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌పై నిర్లక్ష్యం చూపడం ఆందోళనకరమని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో గత స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఇప్పటికీ రెమ్యూనరేషన్, టీఏ, డీఏ బకాయిలు చెల్లించలేదని తెలిపారు.

ఈ నేపథ్యంలో 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, 30 శాతం ఐఆర్ ప్రకటించడం, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, డీఏల మంజూరు, బకాయిల చెల్లింపులకు రోడ్‌మ్యాప్ ప్రకటించడం, ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడం వంటి 18 డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నిరసన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఫ్యాప్టో అనుబంధ సంఘాలతో పాటు సంఘీభావం తెలిపే ఇతర సంఘాలు కూడా ఉదయం 8.30 గంటలకు చేరుకొని నిరసనను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

## బస్సులపై రవాణాశాఖ మంత్రి ఆకస్మిక తనిఖీలు



- నిబంధనలు ఉల్లంఘించిన బస్సు సీజ్ - 15 బస్సులకు చలాన్లు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రవాణా భద్రత చర్యల్లో భాగంగా గుంటూరు జిల్లా ఖాజా టోల్ ప్లాజా వద్ద రాష్ట్ర రవాణా, యువజన ఉ క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బస్సులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రవాణా శాఖ అధికారులతో కలిసి 20కు పైగా బస్సులను పరిశీలించిన మంత్రి, నిబంధనలు పాటించని ఒక బస్సును సీజ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 15 బస్సులపై చలాన్లు విధించారు. ఈ సందర్భంగా బస్సుల సాంకేతిక స్థితి, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు, భద్రతా ప్రమాణాల అమలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. డ్రైవర్లు, సిబ్బంది విధి నిర్వహణలో పాటిస్తున్న నియమాలు, డ్రైవింగ్ లైసెన్సులు, వేగ పరిమితుల పాటింపు వంటి విషయాలను కూడా అధికారులు తనిఖీ చేశారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, టికెట్ విధానం, సీటింగ్ సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే భద్రతా పరికరాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. రవాణా రంగంలో పారదర్శకతను పెంపొందించడం, నియమ నిబంధనల అమలును పటిష్టం చేయడం, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారికి పౌర సన్మానం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి ధరావత్ రాజు నాయక్‌కు తెనాలిలో పౌర సన్మానం నిర్వహించారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా, ఫైలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, ధరావత్ రాజు నాయక్ గుంటూరు జిల్లాలో సహాయ మలేరియా అధికారిగా సేవలందించి, అనంతరం బయాలజిస్టుగా, ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా ఈ సన్మానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలో పనిచేసిన సమయంలో ఆయన విశేష సేవలు అందించినట్లు పేర్కొన్నారు.

అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా యూనిట్ సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ రవికుమార్ తదితరులు ధరావత్ రాజు నాయక్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు.

భవిష్యత్తులో కూడా గుంటూరు జిల్లాకు విలువైన సలహాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివ నాగమల్లేశ్వరరావు, ఫైలేరియా సూపర్వైజర్ తిరువీధుల శివరామ ప్రసాద్, విశ్రాంత సూపర్వైజర్లు కుర్రా రామారావు, ముక్కాల వీరయ్య, నీలా ప్రసన్నబాబు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అభినందన



**ఒంగోలు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా స్థాయి జి.ఎఫ్.ఎల్.ఎన్ పోటీలలో 5వ తరగతి విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన మద్దిపాడు మండలం,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంకటరాజు పాలెం విద్యార్థిని సుచిత రాగిణిని అభినందిస్తూ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు మన్నం శ్రీనివాస్, నల్లూరి నరసింహారావు, యనమల ఆంజనేయులు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య వలననే వ్యక్తికి విలువ, గౌరవం లభిస్తాయని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. విద్యార్థులు లకు మంచి బోధన అందిస్తున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులందరికీ బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కట్టా శ్రీనివాసరావు, కృష్ణప్రియ పాల్గొన్నారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మధ్య శాంతి సంకేతాలు... తదుపరి పరిణామాలపై ప్రపంచ దృష్టి

### కాల్పుల విరమణ చర్చలు, వ్యూహాత్మక మార్పులు -- రాబోయే రోజులు కీలకం

పశ్చిమాసియా ప్రాంతం గత కొన్ని వారాలుగా తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్న నేపథ్యంలో, తాజాగా శాంతి దిశగా కొన్ని సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కాల్పుల విరమణపై చర్చలు జరుగుతున్నాయనే సమాచారం అంతర్జాతీయ వేదికల్లో చర్చనీయాంశంగా మారింది.

ఇటీవలి పరిణామాల్లో ఇరువర్గాలు ప్రత్యక్ష ఘర్షణల నుంచి దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాయన్న సంకేతాలు కనిపిస్తున్నప్పటికీ, అధికారికంగా స్థిరమైన శాంతి ఒప్పందం ఇంకా ఖరారు కాలేదనే విశ్లేషణలు ఉన్నాయి. ఈ పరిస్థితిలో జరుగుతున్న చర్చలు భవిష్యత్ దిశను నిర్ణయించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

కొన్ని వర్గాల సమాచారం ప్రకారం మధ్యవర్తిత్వ చర్చలు జరగవచ్చని సూచనలు ఉన్నప్పటికీ, అవి ఏ స్థాయిలో జరుగుతాయి, ఎలాంటి ఫలితాలు ఇస్తాయి అన్నది స్పష్టతకు రాలేదు. ఈ నేపథ్యంలో రాబోయే రోజులు అత్యంత కీలకంగా మారాయి.

ప్రస్తుతం ఉన్న పరిస్థితి "తాత్కాలిక ఉపశమనం"గా భావించవచ్చని విశ్లేషకులు అంటున్నారు. కానీ దీర్ఘకాలిక శాంతి సాధ్యమవుతుందా లేదా అన్నది చర్చల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఇరువర్గాల మధ్య నమ్మకం, వ్యూహాత్మక ప్రయోజనాలు, అంతర్జాతీయ ఒత్తిళ్లు కీలక పాత్ర పోషించనున్నాయి.

పశ్చిమాసియా ప్రాంతం ప్రపంచ ఇంధన సరఫరాలో కీలకమైనది కావడంతో, అక్కడి అస్థిరత గ్లోబల్ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అందుకే ఈ ప్రాంతంలో శాంతి స్థాపన ప్రపంచ దేశాలకు అత్యంత ప్రాధాన్యమైన అంశంగా మారింది.

మొత్తంగా చూస్తే, పశ్చిమాసియాలో ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితి ఒక కీలక దశను సూచిస్తోంది. శాంతి వైపు అడుగులు పడుతున్నాయా, లేక ఇది తాత్కాలిక విరామమా అన్నది రాబోయే పరిణామాలు నిర్ణయించనున్నాయి. ప్రపంచ దృష్టి ఇప్పుడు ఈ ప్రాంతంపై నిలిచింది.

**రచన:**
**వై.వి. సుబ్బారావు**
**ఎంబీఏ, ఎంఏ (జర్నలిజం).**

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467